నేటి దినపత్రిక
# సూర్య
## కర్నూలు | నంద్యాల
శనివారం | 04 నవంబర్ 2023 | పేజీలు 8



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా
## ముందస్తు చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:**
రాబోవు ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఐజీ వినీత్‌బ్రిజిలాల్, సెబ్ ఐజీ రవీంద్రబాబుతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అయ్యే ఖర్చు వివరాలు, స్వాధీనం చేసుకున్ను నగదు వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి మాస్టర్స్ ట్రైనర్స్ ద్వారా ఇతర సిబ్బందికి శిక్షణ ఇచ్చేలా చర్యలు మిగతా 2లో



# కరువు వచ్చినా కరుణించరా?
- ప్రభుత్వ సాయం కోసం రైతన్నల ఎదురుచూపు

**కర్నూలు, సూర్యప్రతినిధి:**
కర్నూలు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కరువు కోరల్లో చిక్కుకుంది. సాధారణ వర్షాపాతం కూడా నమోదు కాని దుర్భర పరిస్థితుల్లో వేసిన విత్తనం వేసినట్లే మట్టిలో కలిసిపోగా కాస్తో కూస్తో మొలక వచ్చినవి సాగునీటి సదుపాయం లేకపోవడంతో అవి కూడా అశువులు బాశాయి. ఏదోలా తిప్పలు పడి పంట పండించుకుందా మన్న అతికొద్ది రైతుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరై కన్నీరు మిగిల్చింది. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో రైతన్నలను ఆదుకోవడానికి, వారికి ధైర్యం చెప్పడానికి మిగతా 2లో

కార్తీకమాసంలో శ్రీశైలంలో
## ఆర్జిత అభిషేకాలు నిలుపుదల
- భక్తులరద్దీ కారణంగా ఆర్జిత అభిషేకాలు పూర్తిగా నిలుపుదల
- రద్దీరోజులలో స్వామివార్ల స్పర్శదర్శనం నిలుపుదల.. అలంకార దర్శనం మాత్రమే
- సాధారణ రోజులలో నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శదర్శనం
- స్పర్శదర్శనం, ఇతర ఆర్జితసేవల టికెట్లు ఆన్లైన్లో అందుబాటు
- శ్రీశైల దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు



**శ్రీశైలం, మేజర్‌న్యూస్:**
జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల మహా క్షేత్రంలో ఈనెల 14 నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మిగతా 2లో

రైతులుగా సాధించిన
## గిరిజనులు

**మహానంది, మేజర్‌న్యూస్ :**
ఎన్నో ఏళ్లుగా శ్రమించి సాధించుకున్న భూములలో మొదటి పంట దిగుబడితో చెంచులక్ష్మి గూడెంలో ఆనందోత్సవాలతో సందడి నెలకొంది. పూర్వీకుల నుంచి అటవీ హక్కుల చట్టం సాధించడం కోసం ధర్నాలు, దీక్షలు చేసి ఆర్‌ఓఎఫ్‌ఆర్ పొలాన్ని దక్కించుకున్నారు. వివరాలలోకి వెళ్లితే....
మహానంది చెంచులక్ష్మి గూడెంలోని 66 కుటుంబాల వారు మిగతా 2లో


మహానంది చెంచులక్ష్మి గూడెంలో పంటను కోస్తున్న దృశ్యం


నూర్పిళ్లు చేస్తున్న దృశ్యం

పురుగుల మందు తాగి
## రైతు ఆత్మహత్య

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:**
పంటల సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సోమయాజులపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమయాజులపల్లె గ్రామానికి చెందిన కొమ్మరి నాగమద్దయ్య(47)కు 5.50ఎకరాల పొలం ఉంది. మరో 6ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తూ వచ్చాడు. పంటల సాగు కోసం రూ.10లక్షల దాకా అప్పులు చేశాడు. అయితే పంటల సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రాలేదు. దీంతో అప్పుల దారుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడగా గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే కోలుకోలేక మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు ఓర్వకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన నాగమద్దయ్య

సూర్య



# కరువు వచ్చినా కరుణించరా?

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు గాని, పాలకులు గాని నేటి వరకు ప్రయత్నించకపోవడం రైతుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలను మిగిలుస్తోంది. ఒక వైపు ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా వర్షాభావ పరిస్థితులను రాష్ట్రం ఎదుర్కొంటుందని గత 122 సంవత్సరాలుగా ఇంతటి దుర్భర పరిస్థితి లేదని చెబుతున్నా అందులో కొంతశాతమైనా రైతులను ఆదుకునే ప్రయత్నం చేయకపోవడంపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ లెక్కల ప్రకారం కర్నూలు రూరల్, తుగ్గలి మండలాలు మినహా మిగిలిన 22 మండలాల్లోనూ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొని ఉన్నాయని స్పష్టమవుతోంది. ఈ మండలాల్లో 70శాతం మేర పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. అయితే రైతులు మాత్రం వందశాతం పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి ఒక్క రూపాయి కూడా చేతికి రాని పరిస్థితి ఉందని, ప్రభుత్వం ఆదుకుంటే తప్ప తాము నిలబడే పరిస్థితి కనిపించడం లేదని మనోవేదనకు గురవుతున్నారు. జిల్లాలో సాగు భూమి 4,21,500హెక్టార్లు ఉంది. ఇందులో 4,15,974హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారు. అత్యధికంగా పత్తి పంట 1,97,045హెక్టార్లలో సాగు చేయగా, ఆ తర్వాత మిర్చి 59,894హెక్టార్లలో, వేరుసెనగ 37,574, కంది 35,021హెక్టార్లలో రైతులు సాగు చేశారు. ప్రధానంగా మిర్చికి ధర ఎక్కువగా ఉంటుందని రైతులు అత్యధికంగా సాగు చేసినట్లు స్పష్టమవుతోంది.



సాధారణ పరిస్థితుల్లో మిర్చి కేవలం 20వేల హెక్టార్లలోపు మాత్రమే సాగు చేసే రైతులు ఈసారి సుమారు 300లశాతం అధికంగా మిర్చి పంటను వేశారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా మిర్చి పంట ఎక్కడా ఒక్క కాయ కూడా కాయని పరిస్థితి పొలాల్లో కనిపిస్తోంది. సగటున ఒక ఎకరాకు రూ.50వేలు రైతులు ఖర్చు చేసినట్లు తెలుస్తుండగా ఇందులో ఒక్క రూపాయి పెట్టుబడి కూడా తిరిగి రైతు చేతికొచ్చే అవకాశం లేదని వెల్లడవుతోంది.

కర్నూలు జిల్లా కరువును ఎదుర్కొవడంలో కొత్తేమీ కాదని అయితే వర్షాభావ పరిస్థితులు ఉంటాయని రైతులు నష్టపోవడం జరుగుతుందని తెలిసి అధికారులు గాని, ప్రభుత్వం గాని కనీస పరామర్శకు కూడా రాకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌సీజన్‌లో నైరుతి రుతుపవనాల కారణంగా ఒక్క జూలై నెలలో మాత్రమే సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7ఎంఎం కాగా 148.5ఎంఎం వర్షం పడింది. ఇక జూన్ నెల 77.7ఎంఎం గాను 46.9, ఆగస్టు 116.2కు గాను 29.3, సెప్టెంబర్ నెల 116.5ఎంఎంకు గాను 104.8 ఎంఎం, అక్టోబర్ 110.2కుగాను 0.6ఎంఎం వర్షం మాత్రమే కురిసింది. ఇలాంటి తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎగువన తుంగ్రభద్ర జలాశయం నుంచి చుక్క నీరు కూడా దిగువకు రాకపోవడంతో సాగునీరు పొలాలకు చేరని దయనీయ పరిస్థితులు ఏర్పడ్డాయి. రైతులు కోలుకోవాలంటే తక్షణం వారు చేసిన పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తూ మళ్లీ వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ.50వేలు సాయం చేస్తే తప్పా రైతులు మనుగడ సాగించలేని దుస్థితిలో ఉన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, కరువు నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు పనులు లేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకపోయారు. ఆయా కుటుంబాలు వెంటనే తగిన ఆర్థిక సాయం అందజేసి వలసల బారి నుంచి కాపాడాలని రైతు కూలీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఒక్కో కుటుంబానికి రూ.20వేలు సహాయం చేస్తేనే వారి పొట్ట నిండుతుందని, లేదంటే ఆకలి మరణాలు ఏర్పడే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పొరుగున ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఉపాధి నిమిత్తం వలస పోతున్నారని, ఆ కుటుంబాలకు చెందినవృద్ధులు వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణం రైతులను, రైతు కూలీలను ఆదుకునేందుకు సాయం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

---

### ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా

## ముందస్తు చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలనుదృష్టిలో ఉంచుకొని పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ మానవ వనరులకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సెక్టోరల్ ఆఫీసర్లను నియమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీఆర్‌వో మల్లికార్జునుడు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### – వైసీపీ నాయకుడు రాంపల్లి కొట్టాల వెంకటరాముడు



మాట్లాడుతున్న కొట్టాల వెంకటరాముడు

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** బీసీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బీసీలకు పెద్ద పీట వేశారని వైసీపీ నాయకులు రాంపల్లి కొట్టాల వెంకటరాముడు అన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు చంద్రబాబు బీసీలను రాజకీయంగా వాడుకొని వదిలేశారన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు పెద్దపీట వేశామన్నారు. సీఎం వైఎస్ జగన్ 82వేలమంఇ బీసీలకు పదువులు కల్పించిపెద్దపీట వేశారన్నారు. ఏపీ క్యాబినెట్‌లో 27మంత్రుల్లో 11మంది బీసీలకు మంత్రులుగా స్థానం కల్పించారన్నారు. రాష్ట్రంలో గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్న మా భవిష్యత్తు, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలతో ప్రజల అభిమానాన్ని కూడగట్టుకుంటున్నారన్నారు.

### ఈనెల 27, 28న జరిగే

## మహాధర్నాను జయప్రదం చేయండి

**ఆదోని, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర కార్మిక రైతు విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 27, 28వ తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మీరెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు వెంకప్పలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు తేవడం వలన రైతులకు తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. ఈ ధర్నా జయప్రదం కొరకు దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయుసీ జిల్లా నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ఏపిరైతు కూలీ సంఘంనాయకులు మల్లికార్జున, ఐఎన్‌టీయుసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నకేశవులు, ఏఐటీయుసీ నాయకులు ఓ.బి. నాగరాజు, కల్లుబావిరాజు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

---

# రైతులుగా సాధించిన గిరిజనులు

(మొదటిపేజీ తరువాయి)

సాగుభూమి కోసం, నివాస స్థలాల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటాలు సాగిస్తున్నారు. ఆ ఫలితాలు గత ఏడాది సాధించుకున్నారు. అరకొర వసతుల మధ్య ఆ భూమిలో పంటలను సాగు చేసుకుంటున్నారు. హుండాయ్ కంపెనీ వారి సహకారంతో అడవిని సాగుభూమిగా మలుచుకుని మామిడి, జామ, నిమ్మ మొక్కలను నాటుకున్నారు. కొన్నేళ్ల తరువాత వచ్చే ఫల సహాయాన్ని అనుభవించాల్సిన రైతులు త్వరితగతిన దిగుబడి వచ్చే పంటల వైపు ఆసక్తి చూపారు. 33 కుటుంబాలకు వచ్చిన భూముల్లో పండ్ల మొక్కలతో పాటు అంతర్ పంటగా చిరుధాన్యాలైన రాగి పంటను సాగు చేశారు. ఆ పంట మొదటి దిగుబడి రావడంతో గిరిజన కుటుంబాల్లో సందడి నెలకొంది. గూడెం పెద్దలు రాగుల నాగులు, అధ్యక్షులు చలంచలం శ్రీనివాసులు ఈ పంటల సాగు కోసం తమ పోరాటాలను ఇంకా సాగిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం రాగి పంటతో పాటు బంతిపూలు పంట దిగుబడిగా వచ్చాయని మరో అంతర్ పంటగా పుచ్చకాయ పంట సాగుకు విత్తనాలు వేశామని గూడెంలో పెద్దలు తెలుపుతున్నారు. ఏదేమైనా అడవిలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలు రైతులుగా మారుతూ పంటలను సాగు చేయడంపై ఆనందంగా ఉందని ప్రజలు తెలుపుతున్నారు.



నూర్పిల్లు చేస్తున్న దృశ్యం

ప్రభుత్వం సహకారం అందిస్తే తమ కుటుంబాలను ఆదరిస్తే విద్యాపరంగా అభ్యున్నతి చెందుతామని కోరుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం కావాలని వారు కోరుతున్నారు. అరకొర వసతుల మధ్య జీవనం సాగిస్తున్నామని జీవనోపాధికి పంట పొలాలు ఉన్నా నివసించేందుకు గృహాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ప్రభుత్వం వారు సహకరించి నివాస స్థలాలను ఇప్పించిన చోట పక్కా గృహాలను నిర్మిస్తూ మౌళిక వసతులతో పాటు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని గూడెం ప్రజలు, అధ్యక్షులు కోరుతున్నారు. ప్రభుత్వ సహకారానికి ఎదురుచూస్తున్నామని అన్నారు.

### మాదిగల విశ్వరూప మహాసభను

## జయప్రదం చేయండి

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హలో మాదిగ చలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకుడు హెబ్బటం పక్కిరప్ప ఫిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామంలో కరపత్రాలను పంపిణి చేస్తూ ఈ నెల 11వ తేదిన హైదరాబాద్‌లో మహాసభకు అధిక సంఖ్యలో హజరై కావాలన్నారు. ఈ కార్యాక్రమంలో గొవర్ధన్, బజారప్ప, ఖాదర్, శేషగిరి, హుసేన్, రుప్ప, రాముడు పాల్గొన్నారు.



హెబ్బటంలో కరపత్రాలను పంపిణి చేస్తున్న నాయకులు

### కార్తీకమాసంలో శ్రీశైలంలో

## ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

(మొదటిపేజీ తరువాయి)

భక్తులందరికీ స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యాన్ని కలిగించాలని ఉద్దేశంతో దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు కార్తిక మాసంలో పలు మార్పులు చేశారు.గర్భాలయ ఆర్జిత అభిషేకములు,సామూహిక ఆర్జిత అభిషేకాలు, వృద్ధ మల్లికార్జునస్వామి వారి ఆర్జిత అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేయనున్నట్లు, రద్దీ రోజులలో కూడా స్వామివారి స్పర్శదర్శనం కూడా పూర్తిగా నిలుపుదల చేయనున్నట్లు ఈవో తెలిపారు. రద్దీ రోజులైన శని, ఆది, సోమవారాలు, కార్తీక శుద్ధ ఏకాదశిరోజులందు (కార్తీకమాసములో మొత్తం 15 రోజులు) రూ.500 దర్శనం టికెట్లు కూడా అందుబాటులో ఉంచబడ్డాయనీ అయితే ఈ రద్దీ రోజులలో రూ.500 టికెట్ పొందిన వారికి కూడా శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించబడుతుందన్నారు. ఈ రూ.500 అలంకార దర్శన టిక్కెట్లను ఆన్లైన్లో పొందవచ్చు అని కార్తీకమాసంలో ఈ టికెట్లు కరెంట్ బుకింగ్ ద్వారా కౌంటర్ల నుండి కూడా ఇవ్వబడతాయన్నారు.

దేవస్థానం వెబ్సైట్ - www.srisalladevasthanam.org ద్వారా ఆయా టికెట్లను ముందస్తుగా పొందవచ్చు అని అదేవిధంగా గూగుల్ ప్లే స్టోరు నందు srisalla devasthanam మొబైల్ యాప్ను డౌన్లోడ్ చేసుకొని కూడా టికెట్లను పొందవచ్చు అన్నారు.

ఇతర ఆర్జితసేవలైన అమ్మవారి కుంకుమార్చన, గణపతి హోమం, రుద్రహోమం, మహామృత్యుంజయ హోమం, చండీహోమం, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం మొదలైన ఆర్జితసేవలు యథావిధిగా జరుగుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థమై రుద్రహోమం, చండీహోమాలు రోజుకు రెండు విడుతలుగా నిర్వహిస్తామన్నారు. అయితే రూ.150 రుసుముతో గల శీఘ్రదర్శనం (శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే)రూ. 300 రుసుముతో గల అతిశీఘ్రదర్శనం టికెట్లను (శ్రీస్వామివారి అలంకార దర్శనం మాత్రమే) ఆన్లైన్తో పాటు కరెంట్ బుకింగ్ ద్వారా కూడా పొందవచ్చు అని ఈవో పేర్కొన్నారు.

**స్పర్శదర్శనం నిలుపుదల చేయబడిన రోజులు**

| స్లాట్ | సమయం | దర్శనం |
|---|---|---|
| ఉదయం | ఉ.గం.4.30 నుండి ఉ.గం.6.00 వరకు | అలంకార దర్శనం |
| 1వ స్లాట్ | ఉ.గం.6.00 నుండి ఉ.గం.8.00 వరకు | స్పర్శ దర్శనం |
| | ఉ.గం.8.00 నుండి ఉ.గం.11.30 వరకు | అలంకార దర్శనం |
| 2వ స్లాట్ | మ.గం.11.45 నుండి మ.గం.1.00 వరకు | స్పర్శ దర్శనం |
| | మ.గం.1.00 నుండి సా.గం.4.00 వరకు | అలంకార దర్శనం |
| సాయంత్రం | సా.గం.5.20 నుండి రా.గం.7.30 వరకు | అలంకార దర్శనం |
| 3వ స్లాట్ | రా.గం.7.45 నుండి రా.గం.9.00 వరకు | స్పర్శ దర్శనం |
| | రా.గం.9.00 నుండి రా.గం.10.00 వరకు | అలంకార దర్శనం |
| 4వ స్లాట్ | రా.గం.10.00 నుండి రా.గం.11.30 వరకు | స్పర్శ దర్శనం |

# కౌంటర్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా

**గడివేముల,మేజర్‌న్యూస్ :** కౌంటర్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష, ఇద్దరికి జరిమానా పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గడివేముల పోలీసులు తెలిపిన వివరాల మేరకు 2017, మే 30వ తేదీన గడివేముల మండలంలోని దుర్వేసి గ్రామానికి చెందిన ఒక వర్గం కొడుదుల గోవిందరెడ్డికిస్థలం విషయంలో అదే గ్రామానికి చెందిన మన్మోహన్‌రెడ్డి, మూల కృష్ణవేణి, బొమ్మిరెడ్డి చిన్నమ్మలతో గొడవలు ఉండగా వీరు ముగ్గురు కలిసి ధూషిస్తుండగా గోవిందరెడ్డి కుమారుడు కొడుదుల దామోదర్‌రెడ్డి మధ్యలో కలుగజేసుకుని తన తండ్రిని ఎందుకు ధూషిస్తున్నారని అడుగగా ముగ్గురు కలిసి గోవిందరెడ్డిపై వేట కొడవలితో దాడి చేసి గాయాలు పాలు చేశారు. దీంతో దామోదర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన మరొక వర్గం మూల కృష్ణవేణమ్మ 2017, మే 30వ తేదీన తన ఇంటి వద్ద ఉండగా కొడుదుల గోవిందరెడ్డి, కొడుదుల దామోదర్‌రెడ్డి ట్రాక్టర్‌తో ఇంటి వద్ద ఉన్న అరుగును, జాలాడి గుంత బండలను ధ్వంసం చేశారు. ఎందుకు ధ్వంసం చేశారని ప్రశ్నించగా ఇద్దరు కలిసి కృష్ణవేణమ్మ రక్తగాయాల పాలయ్యేలా దాడి చేశారు. మూల కృష్ణవేణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. సదరు కేసుకు సంబంధించి అప్పటి దర్యాప్తు అధికారి ఎస్సై రామాం జనేయరెడ్డి విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. ఈ కేసుపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా పోలీసులు సాక్షా ధారాలతో సహా నిరూపించగా శుక్రవారం నంద్యాల ప్రిన్సిపల్ సెషన్ కోర్టు జడ్జి రాధారాణి దామోదర్‌రెడ్డికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.11 వేలు జరిమానా, గోవిందరెడ్డికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.11 వేలు జరిమానా, మన్మోహన్‌రెడ్డికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 11 వేలు జరిమానా, బొమ్మిరెడ్డి చిన్నమ్మ, మూల కృష్ణవేణమ్మలకు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు గడివేముల ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య తెలిపారు.


## YEMMIGANUR MUNICIPALITY

**e-procurement tender notice**

Notice No. 12/GADAPA GADAPAKU MANA PRABHUTVAM & GENERAL FUND-2023-24/E1, dt.03/11/2023

| | |
|---|---|
| 1. Total No. of Work | 1st call - 4Nos<br>5th call - 1No |
| 2. Value of Work | 40.76Lakhs |
| 3. Bid document download starting date | 04-11-2023 at 10.30 AM |
| 4. Bid document download end date | 21-11-2023 at 3.00 PM |
| 5.Last Date & Time for receipt of Bids | 21-11-2023 at 3.30 PM |
| 6.Commercial Bid opening Date | 21-11-2023 at 4.00 PM |
| 7. Name & Address of the Concerned Officer | **Commissioner, Yemmiganur Municipality. Yemmiganur. Ph.No 08512-255050 Fax: 08512-228050 Email: commissioner ygr @yahoo.com** |

The details of name of work, Tender document, Eligibility Criteria. Bid Submission & Price Bid opening date and EMD details etc., may be seen on e-procurement market place available **@eprocurement.gov.in**

**Commissioner**
**Yemmiganur Municipality.**


# పశువుల పెంపకం కోసం రుణాలు



**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు కిసాన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాములపాడు పశు వైద్యాధికారి అనిల్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పాడి రైతులు పశువుల పెంపకం కోసం బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు అర్హులైన పాడి రైతులు దగ్గర్లోని మీసేవ కేంద్రాల ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన పాడి రైతులకు 75 వేల నుండి లక్ష రూపాయల వరకు బ్యాంకుల ద్వారా ఎటువంటి పోచకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు బ్యాంక్ మేనేజర్లకు అందజేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న తర్వాత బ్యాంకులో పశు వైద్యశాలలో ఒక కాపీ బ్యాంకులో ఒక కాపీ ఇవ్వాలని తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చదువుకునే పిల్లలు సైతం వలసలు..

★ కొత్తపేటలో కొనసాగుతున్న వలస

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం నెరణికి తాండ గ్రామ పంచాయితీ పరధిలోని మజర గ్రామమైన కొత్తపేట గ్రామం నుండి చదువుకునే పిల్లలతో సహా వ్యవసాయా కూలీలు శుక్రవారం తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు వలసలు వెళ్ళారు.ఆ గ్రామంలో వలసలు ఆగడం లేదు.పిల్ల పాపలతో ముసలి ముదకలను వెంట పెట్టుకుని ఇండ్లకు తాళాలు వేసుకుని వలసలు వెళ్తున్నారు. గ్రామంలో కాళీగా కూర్చోని పస్తులు ఉండలేక బ్రతుకు తెరువ కోసం వళసలు వెళ్లి అక్కడ కూలీనాలి చేసుకుని జీవిస్తామని వ్యవసాయా కూలీలు తెలిపారు.శుక్రవారం 23



కుటుంభాలు ఆటోలలో వలస వెళ్ళారు. అందులో చదువునే పిల్లలు 45 మంది ఉన్నారని ప్రజలు తెలిపారు.కొంత మంది పనికి వస్తున్నారని తెలిపారు.గ్రామంలో ఉపాధి పనులు కల్పిస్తున్నారని ఎందుకు గ్రామం విడిచి వలసలు వెళ్తారని ప్రశ్నిస్తే కూలీ డబ్బులు తక్కువ వస్తుందని అందులో పనులు చేసిన 20 రోజులకు ఆలస్యంగా రావడంతో ఉపాధి పనులకు వెళ్ళలేమంటున్నారు.రోజు వారి కూలీ వస్తేనే జీవనం సాగించడానికి ఆస్కారం ఉంటుందని అందుకే సంగారెడ్డి జిల్లాలోని పత్తి,విడుపు,మిరప పంటలలో పనులు చెయడానికి వలస బాట పట్టినట్లు కూలీలు చెప్పారు.

# ఎండిన పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారి



ఎండిన పంటను పరిశీలిస్తున్న దృశ్యం

**బనగానపల్లెరూరల్,న్యూస్:** తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన పడమటిపల్లెల్లో తీవ్ర కరువు నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం బనగానపల్లె మండలాన్ని కరువు మండలాన్ని ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారంనాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు స్థానిక వ్యవసాయశాఖ అధికారి సుబ్బారెడ్డితో కలిసి పాతపాడు, పసుపల, చిన్నరాజుపాలెం గ్రామాలను సందర్శించి వర్షాభావ పరిస్థితుల వలన ఎండిన పంటలను పరిశీలించడం జరిగింది. ఇందులో ప్రధానంగా పసుపల గ్రామ పంచాయితీ నందు పత్తి, మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించారు. పాతపాడు, చిన్నరాజుపాలెం గ్రామాల్లో కంది, మొక్కజొన్న పైర్లను పరిశీలించడం జరిగింది. కరువు పరిస్థితులు కరువు తీవ్రతను ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.




# వివాహితపై లైంగిక వేధింపులు

బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు అరెస్టు

**మంత్రాలయంమేజరున్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని కలుదేవకుంట గ్రామానికి చెందిన ఓ వివాహిత తమపొలంలో పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన రాముడు అను వ్యక్తి ఆమెపై లైంగిక వేధింపుకు పాల్పడటంతో ఆమె మంత్రాలయం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేయటం జరిగింది. దీనిపై స్పందించిన మంత్రాలయం ఎస్సై వేణుగోపాలరాజు నిందితుడైన రాముడిని అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అయితే నిందితుడు కేసు లేకుండా రాజీ యత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# ఇంట్లో చోరి..బంగారు,నగదు అపహరణ

-రూ. 3లక్షల నగదు, మూడు తులాల బంగారు, 20 తులాల వెండి మాయం



దొంగలు బీరువాను పగలగొట్టిన దృశ్యం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్లలోని అచ్చుకట్ల వీది షాదీఖాన దగ్గర శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని దొంగలు దేశాయి రహంతుల్లా ఇంట్లో చోరి చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు దేశాయి రహంతుల్లా, షాయినాబీ దంపతులు పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి ఉదయం పొలంకు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరు లేని విషయాన్ని గుర్తించిన గుర్తు తెలియని దొంగలు సాయంత్రం నాలుగు లేదా ఐదు గంటల సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంటిలోకి వెళ్లి బీరువా తళాలను పగలగొట్టారు. బీరువాలో ఉన్న రూ. 3లక్షల నగదు, మూడు తులాల బంగారునగలు, 20 తులాల వెండిని దొంగలించారు. ఇంటిపక్కల ఉన్న మహబుబ్,అప్సర్‌కు శబ్దాలు రావడంతో దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. దొంగలు పారిపోయరని పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎఫ్ ఆర్ ఎస్ యాప్‌ను రద్దు చేయాలి




**డోన్ ,మేజర్ న్యూస్ :** ఎఫ్ ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు సంఘాలు తీర్మానం చేసినటువంటి డిమాండ్స్ పరిష్కరించాలని ,అదేవిధంగా అధికారుల ఒత్తిడికి తలొగ్గి అంగన్వాడీలు ఎఫ్ ఆర్ ఎస్ యాప్‌ను చేయాల్సిన అవసరం లేదని,ఏఐటీయూసీ అండగా ఉంటుందని భరోసానిచారు.ఈకార్యక్రమంలో ఏఐటీయూసీడోన్ నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు అబ్బాస్, పుల్లయ్య,అంగన్వాడి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చాందిని, ఎస్తేరు, జయలక్ష్మి, షరీఫా,సుగుణ, మస్తాన్ బి,లక్ష్మీశ్వరి,నిర్మల, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



**పాములపాడు, మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిడిశ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జూటూరు గ్రామంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా లబ్ధి పొందిన వెంకట రమణమ్మ జిరాక్స్ దుకాణాన్ని ఏపిఎం అనురాధ తో కలిసి ప్రారంభించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన ద్వారా 35% సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సావిత్రమ్మ, పంచాయతీ సెక్రెటరీ పుల్లయ్య, వైసిపి నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి- సబ్ కలెక్టర్

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

**ఆదోని,మేజర్‌న్యూస్ :** నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్‌లు పాల్గొన్నారు. నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగ రంగంలో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకొని కంపెనీలో ఉన్నతస్థాయికి ఏదిగి తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ జాబ్‌మేళాలో 14కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 601మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా, వీరిలో 188మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత , ఆదోని మార్కెట్‌యార్డు ఛైర్మన్ నజీర్ అహ్మద్, వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మ ప్ప, ఆదోని ఆర్ట్స్ అండ్ కళాశాల కరస్పాండెం ట్ దైవాదీనంరెడ్డి, ప్రిన్సి పాల్ మురళీమోహన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత రెడ్డి, నరసింహామూర్తి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



సూర్య

శనివారం 04 | నవంబరు 2023

# మంత్రి బుగ్గనా..డోన్ ప్యాపిలి మండలాలు ఏం పాపం చేశాయి

**కరువు మండలాలుగా కనబడలేదా**

**వెంగళంపల్లెలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ**

**కార్యక్రమానికి విశేష స్పందన**



**ప్యాపిలి,మేజర్ న్యూస్ :**డోన్ ప్యాపిలి మండలాలలో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ కరువు మండలాల జాబితాలో స్థానం దక్కకపోవడం ఆర్థిక మంత్రి బుగ్గనకు కనబడలేదా అని ఏం పాపం ఈ మండలాలు చేశాయని, బేతంచర్ల పై ఉన్న ప్రేమ ఎందుకు లేదని డోన్ నియోజవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మారం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ కాటమయ్య, మురళీకృష్ణ గౌడ్‌లు హాజరుకాగా, మాజీ సర్పంచ్ జయశీలమ్మ, బసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కోదండరామయ్యల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గ పాలన నడుస్తుందని వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. వెంగలాం పల్లె గ్రామం టిడిపికి కంచుకోట అని తిరిగి 2024 ఎన్నికలలో సుబ్బారెడ్డికి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండికోట రామసుబ్బయ్య, మెట్టుపల్లి సుదర్శన్, ప్రసాద్ రెడ్డి,రామ్మోహన్ యాదవ్, సుధాకర్ గుప్తా, గండికోట పెద్ద రామాంజనేయులు, వెంకటప్ప సూరన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్యాపిలిలో 8వ వార్డులో పెద్ద నాగిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చిన్న సుంకయ్య, చల్లా వీరాంజనేయులు, చల్లా అనుదీప్, ఎస్ కే వలీ, పూజారి శివకిషోర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీతో వైసీపీలో వణుకు



మాండ్ర శివానందరెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారం చేపడితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శుక్రవారం మిడ్తూరులో మండల టీడీపీ కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంతో వైసీపీ నేతల వెన్నుల్లో వణుకు పుడుతోందని అన్నారు. ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందన చూసి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏం అభివృద్ధి జరిగిందో వారికే తెలియాలని అన్నారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మాండ్ర శివానందరెడ్డి సమక్ష్యంలో చెప్పుకున్నారు. త్వరలో తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోను విడుదల చేయడం జరుగుతుందని, సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకుంటే ప్రజల భవిష్యత్తు ఎలా ఉంటుందో వివరిస్తూ ప్రజలతో మమేకమై ముందుకు సాగారు. ఈ సైకో ముఖ్యమంత్రి నాలుగున్నర సంవత్సరాల్లో చేసిందేమీ లేదని రోడ్లకు గుంతలు పడితే పూడ్చలేని వారు రాజధానుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. చంద్రన్న పథకాలే భవిష్యత్తుకు గ్యారెంటీగా ఉంటాయని అన్నారు. టీడీపీకి ఓటు వేసి వైసీపీని గద్దె దించాలని అన్నారు. అనంతరం మండల కన్వీనర్ కాతా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది చదువుకుంటున్న పిల్లలు ఉన్నా వారికి ఏడాదికి రూ.15 వేలు, రైతన్నలకు అన్నదాత పథకం కింద రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లను పంపిణీ చేస్తామని అన్నారు. టీడీపీ చేసిన అభివృద్ధి, మళ్లీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధిని, వైసీపీ చేస్తున్న అరాచకాలను గమనించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, న్యాయవాది నాగమణి, మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ గుండం రమణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, సుధాకర్ యాదవ్, గుండం సర్వోత్తమ్‌రెడ్డి, జమిల్, ముర్తుజావలి, షాకర్ వలీ, యువ నాయకుడు యరబం ప్రమోద్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో విగ్రహాల ప్రతిష్ఠ



అనంత పద్మనాభ స్వామి విగ్రహాలను ప్రతిష్ట చేస్తున్న దృశ్యం

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని డి.వనిపెంట పంచాయితీకి మజరా గ్రామమైన డి. కొత్తపల్లె గ్రామంలో వెలసిన రామాలయానికి గ్రామానికి చెందిన ఎరువ పెద్దీశ్వరరెడ్డి, ఏరువ రోసిరెడ్డి, ఏరువ పెద్ద నరసింహారెడ్డి, ఏరువ ప్రతాపరెడ్డిలు ఇచ్చిన సుమారురూ.3లక్షల విరాళాలతో అనంత పద్మనాభస్వామి, విఘ్నేశ్వరుడు, లక్ష్మీదేవి విగ్రహాలతో ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవస్థానం అర్చకులు వెల్లాల జనార్ధనశర్మ, సంపత్ శర్మల ఆధ్వర్యంలో రామాలయంలో గణపతిపూజ,అభిషేకం,పునఃవచనం,నవగ్రహపూజ, కళశ స్థాపన పూజలు నిర్వహించారు. అలాగే అనంత పద్మనాభస్వామికి పంచామృత అభిషేకం, గణపతి హెూమం, సుదర్శన హెూమం, నవగ్రహ హెూమం, పూర్ణాహుతి. విగ్రహ ప్రతిష్ఠాపన తదితర హెూమాలు నిర్వహించి ముఖ ద్వారాన్ని క్రేన్ సహాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన మహిళా బృందంచే కోలాటం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు. గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వేద పండితులు

# నగరంలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** ప్రపంచశాంతి కోసం కర్నూలు నగర ముస్లింలు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కర్నూలు నగరంలోని ఉమర్ అరబిక్ కళాశాల ఆవరణలో పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకొని పాలస్తీనాదేశంపై జరుగుతన్న దాడులు నిలిపివేయాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు. ప్రపంచ శాంతి కోసం దువా చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో మంచిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు మౌలానాజుబైర్ అహ్మద్‌ఖాన్, సయ్యద్‌జాకీర్‌అహ్మద్,అబ్దుల్లా హాపిసాబ్, షావాలిమౌలానా, ముఫతిఅబ్దుల్‌రెహాన్‌సబ్, ఖౌసిఫ్, అబ్దుల్‌ఖుద్దుస్, వైసీపీ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# సనాతన సాంప్రదాయాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది



పుట్టపాశం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ నాయకులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** సనాతన సంప్రదాయాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని టీటీడీ హిందు ధర్మ ప్రచారం పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకరెడ్డి అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మండల పరిధిలోని పుట్టపాశం గ్రామంలో టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే గత నాలుగు రోజులుగా శివాలయం నందు ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారంచివరిరోజు కావడంతోగోమాతకుకుంకుమార్చన నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శివాలయం వరకు గోమాత తో నగర సంకీర్తన, శోభాయాత్ర చేశారు. మేడా సబ్రమాణ్యం స్వామి ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంతగాతో ఆలరించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి, బీటీ రామచంద్రుడు, నంబిరాజు, ఈశ్వరరెడ్డి, తిమ్మగురుడు, సీఎం పెద్దనాగన్న, రామకృష్ణ బీటి గంగాధర్, బ్రహ్మయ్య, వెంకటేష్, సంకన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పిత్తవాహికలో ఇరుక్కపోయి తుప్పుపట్టిన స్టెంట్

**– సంక్లిష్టమైన శస్త్రచికిత్సతో నయం చేసిన కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ జానకిరామ్**



కోలుకున్న యువకుడు

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్ :** రెండేళ్ల క్రితం వచ్చిన తీవ్రమైన కామెర్లకు వచ్చిన రోగికి వాటిని తగ్గించేందుకు ఒక స్టెంట్ వేశారు. ఆ విషయం మరచిపోయి రోగి స్టెంట్ తీయించుకోలేదు. అయితే పిత్తవాహికలో ఇరుక్కపోయి స్టెంట్ తుప్పుపట్టింది. దీంతో అనారోగ్యానికి గురైన రోగికి సంక్లిష్టమైన శస్త్రచికిత్సతో కర్నూలు కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జానకిరామ్ నయం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆళ్ళగడ్డకు చెందిన 30ఏళ్ల యువకుడు తీవ్రమైన జ్వరం, అధిక కామెర్లతో కిమ్స్ ఆసుపత్రికి వచ్చారు. ఆ వ్యక్తికి పరీక్షలు నిర్వహించగా పిత్తవాహికలో గత రెండేళ్ల క్రితం వేసిన స్టెంట్ ఇరుక్కపోయి తుప్పుపట్టినట్లు గుర్తించారు. దీంతో డాక్టర్ జానకిరామ్ ఆ యువకుడికి శస్త్రచికిత్స నిర్వహించి రోగి ప్రాణాలను కాపాడారు. స్టెంట్ తీసివేయడంతో అతడికి పూర్తిగా నయమైంది. వారంరోజులపాటు ఆసుపత్రిలో వైద్యసేవలు అందించి సాధారణంగా ఉండటంతో డిశ్చార్జి చేశారు.

# రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ నమోదు

**వెల్దుర్తి మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తాసిల్దార్ శివ రాముడు తెలిపారు. కొత్త ఓటర్ నమోదు తో పాటు, ఓటర్ జాబితాలో పేరు తొలగింపు, పేరు మార్పు, పోలింగ్ కేంద్రాల మార్పులకు సంబంధించి బి ఎల్ వో లకు దరఖాస్తులు అందించవచ్చు అన్నారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినిలను అభినందిస్తున్న దృశ్యం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నాసా ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ మ్యాప్ టూ స్పేస్ స్టూడెంట్ ఆర్ట్ కాంటెస్ట్ ప్రోగ్రామ్‌లో స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ మహ్మద్‌అల్తాఫ్ తెలిపారు. ప్రతి ఏడాది జరిగే ప్రోగ్రామ్‌కు ఎంపికైన విద్యార్థులకు స్కూల్ ఏజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భూమిపై పర్యావరణ కాలుష్యం ఏర్పడినప్పుడు మానవులు స్పేస్‌పైన నివసించడానికి అక్కడి వాతావరణం అనుకూలతను పరిశోధించడం అవకాశం ఉంటుందన్నారు. నాసా కొన్ని థీమ్స్ ఎంపిక చేసిందని, అందులో స్పేస్‌కాలనీ, స్పోకే హోటల్, అస్తెరియట్ మైనింగ్ అంశాలను తయారు చేసిన ప్రాజెక్టును నాసాకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, ఏడీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నాగేంద్ర పాల్గొన్నారు.

# మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కర్నూలు దిశా పోలీసుస్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని ఒకేషనల్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినిలకు మహిళా చట్టాలు, దిశా యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన దిశ యాప్ రిజిస్ట్రేషన్, చైల్డ్ పోర్నోగ్రఫీ, పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్, లోన్ ఫ్రాడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ వమత, మహిళా కానిస్టేబుల్ పుల్లమ్మ పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం..

**బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే బీవీ**


కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అభివృద్ధి చెందాలన్నా.. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని, ఆయన పాలన రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక 4,5వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం అన్నారు. నియంతల వ్యవహరిస్తున్న సీఎం ప్రతిపక్షాలపై అణిచి వేయడమే లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. వీటన్నింటిని గమనిస్తున్న ప్రజలు ఓటుతో సరైన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పిల్లల ఉజ్వలభవిష్యత్తు ఉండాలంటే రానున్న ఎన్నికల్లో అంతా టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఎడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి న వెంటనే చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేస్తారన్నారు.టీడీపీ కౌన్సిలర్ రాందాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, నాయకులు చేనేత మల్లి, నాగూర్ బాషా, ఈరన్న, మినప్ప తదితరులు పాల్గొన్నారు.

# హలో బీసీ ఛలో వైజాగ్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావుయాదవ్

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్ :** ఈనెల5వతేదీన చేపట్టిన హలో బీసీ ఛలో వైజాగ్ కార్యక్రమాన్ని బీసీలంతా విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం భవనంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీల డిమాండ్ల సాధన కోసం త్వరలోనే రథయాత్ర చేపడుతున్నామన్నారు ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద బీసీల సమస్యలపై ధర్నా చేపడుతున్నామన్నారు. బీసీల సమస్యలపై అన్ని జిల్లా కేంద్రాలలో ధర్నా, దీక్షలు చేపట్టి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు శ్రీనివాసులు,రాంబాబు,విజయ, ఓబులేసు, వెంకటేష్, బీసీలు పాల్గొన్నారు.

# తప్పుడు కేసు నమోదు చేయడం హేయమైన చర్య



**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయఅధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నాయకులు కొల్లు రవీంద్ర పై తప్పుడుకేసులు బనాయించడం హేయమైన చర్య అని లినంద్యాల జిల్లా టిడిపి బీసీ సెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు అన్నారు. ఈ సందర్భంగా సల్లా నాగరాజు మాట్లాడుతూ,నాలుగున్నర సంవత్సరాలుగా కల్తీ, నాసిరకమైన మద్యంఅమ్మి లక్షకోట్లు దోచుకున్న జగన్‌రెడ్డి చంద్రబాబు హయాంలో మద్యం కుంభకోణం జరిగిందంటూ కేసు పెట్టడం దుర్మార్గమని అన్నారు. చంద్రబాబు, కొల్లు రవీంద్రపై తప్పుడు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వరసగా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడాన్ని దారుణమని మద్యంలో దోచుకున్న దెవరో పసిపిల్లాడిని అడిగినా చెబుతారని అన్నారు. చంద్రబాబు నాయుడు ఏదో చేశారంటూ కేసులు పెట్టడం జగన్ రెడ్డి పైశాచిక త్వానికి నిదర్శనం అని అన్నారు.తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, రామతీర్థం, దూదేకుల మహబూబ్ బాషా, బాల దస్తగిరి, మంగళి శేఖర్ పాల్గొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోండి - జె.సి


సమావేశంలో మాట్లాడుతున్న జె.సి రామ్‌కుమార్ రెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** రైతులు కొనుగోలు కేంద్రాల ద్వార తమ పంటలను విక్రయించుకోవాలని ఆయన తెలిపారు. శుక్రవారంనాడు బనగానపల్లె మండల పరిధిలోని నందవరం గ్రామంలో ఆర్.బి.కెల ద్వార వ్యవసాయ శాఖ మరియు పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో జొన్న పంట కొనుగోలుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సోదరులు కనీస మద్దతు ధర లేనప్పుడు మార్కెట్ ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తాము పండించిన పంటను అమ్ముకోవచ్చని తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో సివిల్ సప్లై ద్వార పంపిణీ చేస్తున్నటువంటి జొన్నలను నంద్యాల జిల్లా నుంచే కొనుగోలు చేస్తున్నామని అందులో బనగానపల్లె మండలం నుంచి ఎక్కువ కొనుగోలు చేయాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇందులో జిల్లా వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ మోహన్‌రావు మరియు జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారి రాజు, నంద్యాల వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, మండల రెవెన్యూ అధికారి మరియు వ్యవసాయశాఖ అధికారి సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయండి



**కర్నూలు, మేజర్ న్యూస్ :** భూమికోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం జరుగుతున్న పోరులో అసువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూఅమరవీరుల స్మారక సభలను జయప్రదం చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి.వెంకటస్వామి, జిల్లా నాయకులు. రంగనాయకులు పిలుపునిచ్చారు.అనంతరం స్థానిక కర్నూలు నగరంలో గోకారి నగర్ నందు గోడపత్రికలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల సంస్కరణ సభ బొల్లవరం గ్రామం ఈనెల 6 తేదీన, వేంపెంట గ్రామం నందు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 9 తేదీన బహిరంగ సభ ర్యాలీ ఉంటుందని అన్నారు. ఈ బహిరంగ సభకు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరైతారని అన్నారు. అరుణోదయ కళాకారులు ప్రదర్శన ఉంటుందని అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుండి నేడు గోదావరిలో ప్రతిఘటన పోరాటాల దారిలో భూమికోసం భుక్తి కోసం జరుగుతున్న విప్లవోద్యమంలో మృత్యుని ముద్దాడిన వీరకిశోరాలు, కామ్రేడ్.చంద్ర పుల్లారెడ్డి, నీలం రామచంద్రయ్య, అనేకమంది విప్లకారులు మరణించారు. చీకటినీ చీల్చి పండు వెన్నెలను పంచి ఉద్యమానికి ఊపిరూది ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించారని అన్నారు.జనం కొరకు తన చివరి శ్వాస వరకు పోరాడిన అనేకమంది విప్లవవీరులు పేద ప్రజల రాజ్యం కై ప్రభుత్వం చేత హత్యగావించబడ్డారని వీరందరికీ సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ విప్లవ జోహార్లు అర్పిస్తూ అమరవీరుల ఆశయ సాధనలో ముందుకు తీసుకువెల్లుతుంది వారి అశయ సాధనలో సభలు జరుపుతామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావడం కోసం అమరవీరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, పీవైఎల్ జిల్లా కార్యదర్శి రమేష్, నగర కార్యదర్శి రాము. గోకారి నగర్ నాయకులు మౌలాబి, రాజమ్మ,సాయి. ఎల్లమ్మ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి**

**వెల్దుర్తి రూరల్, మేజర్ న్యూస్ :** పార్టీలకు అతీతంగా సీఎం సహాయనిధి క్రింద మంజూరైన 7మందికి 7లక్షల 48 వేల రూపాయల చెక్కులను బాధితులకు పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన స్వగ్రామమైన చెరుకులపాడు గ్రామంలో క్రిష్ణగిరి,తుగ్గలి,వెల్దుర్తి మండలాలలోని సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ క్రింద లేనటువంటి చికిత్సలు అన్నిటికీ కూడా సీఎం ఆర్ఎఫ్ క్రింద దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలియజేశారు. క్రిష్ణగిరి మండలం ఈడిగ నారాయణ, కర్లకుంట 30,000 చెక్కును అందించారు.మంగలి జ్యోతి,గువ్వలకుంట్ల36,000 చెక్కును అందజేశారు. షేక్ రతన్ దాదా ఇంతియాజ్ భాష బొందిమడుగుల 2,00,000,అప్ప విమల, ఉపర్లపల్లి 1,20,000,కురువ యెల్లకృష్ణ, లక్ష్మీనగరం22,000,నర్సింగ్ శివకేశవరెడ్డి నర్సాపురం 2,40,000, కంచె నారాయణ,గోవర్ధనగిరి 1,00,000, సీఎం సహాయనిధి అందించినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి,ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో తుగ్గలి, వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల వైఎస్ఆర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందిస్తున్న దృశ్యం

# నవంబర్ 7న ఆళ్లగడ్డలో సామాజిక సాధికార బస్సు యాత్ర

**విజయవంతం చేయాలన్న ఎమ్మెల్యే గంగుల నాని**
**బస్సు యాత్ర తోనే ఎన్నికల శంఖారావం ప్రారంభంవుతుందన్న మాజీ విప్ గంగుల**
**పాల్గొన్న కాటసాని, అమర్నాథ్ రెడ్డి, నరసింహ రెడ్డి**





**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలో ఈనెల 7వమంగళవారం నాడు జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని నంద్యాల జిల్లా వైసిపి అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్ ఆకేపోగు అమర్నాథ్ రెడ్డి, వైసిపి ఎన్నికల పరిశీలకులు నరసింహా రెడ్డి రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి,శాసనసభ్యులుగంగులనానిలు పిలుపునిచ్చారు. శుక్రవారం శాసన సభ్యులు గంగుల నాని కార్యాలయ ఆవరణంలో తాలూ కాలోని ముఖ్య వైసిపీ నాయకులు, వైసిపి ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు,జడ్పిటిసిలుతో సామాజిక సాధి కార బస్సు యాత్ర విజయవంతం చేయాలన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల నాని మాట్లాడుతూ నవంబర్ 7న సామాజిక సాధికారిక బస్సు యాత్ర నంద్యాల జిల్లాలో మొట్టమొదటగా మన ఆళ్లగడ్డలోనే జరుగుతుందన్నారు. పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మీ సహకారం తోనే బస్సు యాత్రను విజయవంతం అవుతుందన్నారు. గత ప్రభుత్వాలు బీసీ,ఎస్సీ, ఎస్టి, మైనార్టీలను ఓటు బ్యాంకు కోసమే వాడుకున్నాయని మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలోని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారందరికి పెద్దపీట వేసిందన్నారు. ప్రభుత్వంలోని పలు పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు నుండి ఏడు గంటల వరకు ఈ బస్సు యాత్ర జరుగు తుందని విజయవంతం చేయాలని గంగుల నాని కోరారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు సీనియర్ వైసీపీ శాసనస భ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలుఅందరూ ఒకసారి ఆలోచన చేయాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు లోకల్ బాడీలతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యత పదవుల్లో పెద్దపీట ఇవ్వడం జరిగిందన్నారు. చైర్మన్లుగా, వైస్ చైర్మన్ లుగా రాష్ట్ర మరియు జిల్లాలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లకు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర జలవనరుల ప్రభుత్వ సలహాదారులు, మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసింది మన ప్రభుత్వమే అన్నారు. 2.40 వేల కోట్ల రూపాయలను వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా నేరుగా లబ్ధి దారునికే అందే విధంగా చేసిన ఘనత మన ప్రభుత్వమేఅన్నారు.నవంబర్ 7బస్సు యాత్ర తో ఎన్నికల శంఖా రావం ప్రారంభమైనట్లే అని గంగుల అన్నారు. ప్రతి నాయకులు, కార్యకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.జిల్లా కోఆర్డినేటర్ ఆకేపోగు అమర్నాథ్ రెడ్డి, వైసిపి పరిశీలకులు నరసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ తదితరులుమాట్లాడారు. రాష్ట్ర వైసీపీమైనార్టీ నాయకులు షేక్ బాబులాల్, ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి,వైసీపీనాయకులు శివరామి రెడ్డి, డాక్టర్ శీలం సురేంద్రనాథరెడ్డి, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సూర్య
శనివారం | 04 నవంబర్ 2023

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషదాయకం

### జడ్పిటిసి విరుపాక్షి


చిప్పగిరి జడ్పిటిసి విరుపాక్షి

**చిప్పగిరి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వారికి అలస్యమైనా మూడు సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానం చేయడం సంతోషదాయకమని ఉమ్మడి కర్నూలుజిల్లా పంచాయతీరాజ్ వింగ్ జోనల్ అధ్యక్షులు జడ్పిటిసి విరుపాక్షి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన వాటితో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని అలాగే జర్నలిస్టులకు ఉచితంగా మూడు సెంట్ల స్థలంతో పాటు ఇళ్లు కూడా నిర్మించి ఇస్తారని అన్నారు. సిఎం జగన్ జర్నలిస్టులకు అండగా ఉంటామని చంద్రబాబు గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఎటువంటి సహాయం అందించలేకపోయారని అన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాలకు చెందిన 5మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6లక్షల 25వేలు విలువ గల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని వ్యాధులకు చికిత్స నిమిత్తం సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం కల్పించి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే శిల్పాకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి భరోసా కల్పిస్తూ ఆరోగ్య శ్రీ పథకాన్ని కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ పథకంలో లేని వ్యాధులకు చికిత్స చేయించుకొనే ఆర్థిక స్థోమత లేని పేదవారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో పున్నా శేషయ్య, పురుషోత్తంరెడ్డి, కిరణ్, లక్ష్మీనారాయణ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బూత్‌ల వారీగా బాబుతో మేము సైతం కార్యక్రమం


కరపత్రాలతో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుందలో శుక్రవారం 39,40 బూత్ వారిగా బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటి,బాబుతో మేము సైతం కార్యాక్రమం నిర్వహించారు. తాలూక ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు పార్టీ మండల కన్వీనర్ తిప్పయ్య ఆధ్వర్యంలో బూత్ వారిగా ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫేస్టో కరపత్రాన్ని ప్రజలకు ఇచ్చి ప్రచారం చేశారు.వైసీపీ ప్రభుత్వానికి బుద్ది చెప్పి టీడీపీ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఆదాం,యూనిట్ ఇన్‌చార్జీ తుంబళం గాదిలింగ,ఐటీడీపీ తాలూక కార్యాదర్శి హనుమంతు, బషీర్, టీఎన్‌ఎస్‌ఎఫ్ మల్లకార్జున, తిక్కస్వామి, మోహిన్, తిప్పన్న పాల్గొన్నారు.

## డ్యాం వద్ద ఎస్పీఎఫ్ సిబ్బందికి అవినీతి నిర్మూలనపై అవగాహన

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం డ్యాం వద్ద స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్)డిజి వారి ఉత్తర్వుల మేరకు శ్రీశైలం యూనిట్ ఇంచార్జ్ డి.వెంకటరమణ ఎస్పీఎఫ్ సిబ్బందికి అవినీతి నిర్మూలనపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బందికి పలు అంశాలను వివరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు పోలీస్, రంగస్వామి, ఏఎస్‌ఐలు అమరేశ్వరరావు, గోపాలకృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మనిషిలో ఉన్న స్వార్థమే అవినీతికి దారి



విజిలెన్స్ అధికారి రాజశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాలలో యూనియన్ బ్యాంక్ సిబ్బంది విజిలెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నరసింహారావు, విజిలెన్స్ అధికారి రాజశేఖర్ , కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, బ్యాంకు మేనేజర్ రవీంద్రలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మనిషిలో ఉన్న స్వార్థమే నేటి అవినీతికి దారితీస్తుందని తగ్గించడంలో మనందరి బాధ్యత ఉందని మనం రేపటి అవినీతి లేని భవిష్యత్తుకు మార్గం కావాలని చెప్పారు. మనం ఎన్నుకున్న నాయకుడు కూడా అవినీతి కట్టడిలో ఎంతో ముఖ్యమైనది అని తెలిపారు. మనం చిన్ననాటి నుంచే పిల్లలకు అవినీతి తప్పుమార్గం అని బోధించాలని తెలిపారు. నరసింహారావు మాట్లాడుతూ నేటి సమాజం నాడు గాంధీ చెప్పిన సత్యం, అహింసల వైపు కాకుండా అవినీతిఇ వైపు దారితీస్తుందని చెప్పారు. ఏది మంచి ఏది చెడు అని మనం గ్రహించాలన్నారు. ఇకపై అవినీతి లేని దేశంగా మన భారతదేశాన్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిది తెలిపారు. బ్యాంకు మేనేజర్ రవీంద్ర మాట్లాడుతూ అవినీతి రకాలను తెలిపారు. అనర్హులు పైకి ఎదగడం వల్ల అవినీతి పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య మాట్లాడుతూ మన చట్టాల గురించి మనం తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ప్రపంచంలో అవినీతిపై జరిగిన సర్వేలో పలు దేశాలు ముందుండగా మన భారతదేశ 80స్థానంలో ఉందని తెలిపారు. అవినీతి మన దేశ అభివృద్ధిని భంగపరుస్తుందని తెలిపారు. ఈఅవగాహన కార్యక్రమంలో భాగంగా సే నోటు కరెక్షన్ కమిట్ టు ది నేషన్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

## వివాహ వేడుకల్లో కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు


వధూవరులతో కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్రనాయుడులు కర్నూలులోని జిఆర్‌సి ఫంక్షన్ హాలులో డాక్టర్ విజయకుమార్ మేనల్లుడు పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను వారు ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైస్ జగనన్న సురక్ష పథకంతో ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిక్షలు ఉచితంగా నిర్వహించి మందులు అందిస్తున్నారని అన్నారు.పేద ప్రజల ఇంటికే ఇప్పుడు వైద్యులు వెళ్లి చికిత్సలు అందిస్తున్నారని అన్నారు.అలాగే జర్నలిస్టుల కోసం మూడు సెంట్ల స్థలం ను కేటాయిస్తానని మంత్రివర్గ తీర్మానం చేయడం సంతోషదాయకమని అన్నారు. జర్నలిస్టులకు వైసిపి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## చంద్రన్నను గెలిపించుకుందాం

### – టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేసిన టీడీపీ నాయకులు


ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**కౌతాళం, మేజర్‌న్యూస్ :** వచ్చే 2024 ఎన్నికలలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడికి ఓటు వేసి గెలిపించుకుందామని, ప్రజలు చంద్రన్న రాజ్యాన్ని కోరుకుంటున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి క్లస్టర్–3 ఇన్‌చార్జి అల్లూరి వెంకటపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఎరిగేరి, తోవి, బదినేహాల్ గ్రామాల్లో శుక్రవారం 'బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్పతో కలిసి పర్యటించారు. టీడీపీ పార్టీ అధిష్ఠానం విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అధికార వైసీపీ పార్టీ చేస్తున్న అక్రమాలు, దందాలను ప్రజలకు తెలియజేశారు. సామాన్య ప్రజలు వైసీపీ ప్రభుత్వ హయాంలో బతకలేక పోతున్నారన్నారు. దాడులు, అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేస్తున్నారని, అధికార పార్టీపై విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. చంద్రన్న రాజ్యాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, ఓటు వేసి చంద్రన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు ఎరిగేరి బసవరాజు, యూనిట్ ఇన్‌చార్జి సీమెచ్ రమేష్, స్వామి, తోవిశంకర్, సోమనాథ్, గణేష్, బూత్ ఇన్‌చార్జిలు రమేష్, వీరేష్, ఈరన్న, రంగస్వామి, భీమేష్, సీఎం రమేష్, ఐటీడీపీ నాయకులు మంజునాథ్, ఎరిగేరి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులను శాస్త్రీయ పరిశోధనల వైపు నడిపించేవే

# టింకరింగ్ ల్యాబ్

- ఆత్మకూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రయోగాలు
- యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం
- విద్యార్థులను తీర్చిదిద్దుతున్న హెచ్ఎం నాగరాజు, పద్మావతిలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** చిన్నారుల మదిలో మెరిసిన తార్కిక ఆలోచనలను ప్రోత్సహించి వారిని శాస్త్రీయ దృక్పథం వైపు నడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మంజూరు చేసింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్న విద్యార్థులను శాస్త్ర సాంకేతిక విజ్ఞానపరంగా తీర్చిదిద్దేందుకు మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలను కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఇలా రోబోటిక్ పరిజ్ఞానాన్ని విద్యార్థుల చెంతకు తీసుకొచ్చి క్షేత్రస్థాయిలో సరైన రీతిలో ఉపయోగపడుతున్న ప్రయోగశాలలపై 'మేజర్‌న్యూస్' ప్రత్యేక కథనం. పతదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్న పాఠశాలలను ఎంపిక చేసి ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మంజూరు చేసింది. ఇందులో భాగంగా నల్లమల అటవీ ప్రాంతం మారుమూల గ్రామాలైన ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కురుకుంద, దుద్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసుకొని ప్రయోగశాలలను ఏర్పాటుచేసింది. ఆత్మకూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యా యురాలు పి. పద్మావతి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని విద్యార్థులను ల్యాబ్‌కు తీసుకొచ్చి చిన్న చిన్న ప్రాజెక్టులు చేయిస్తు శాస్త్రవేత్తలుగా తయారు చేసే దిశగా కృషి చేస్తున్నారు. తమ పాఠశాలలో ప్రయోగశాలను చూసి విద్యార్థులు ఎంతో ఆసక్తిని చూపుతూ ప్రయోగాలు చేసేందుకు ముందుకొస్తు తమ ఆలోచనలను ఆచరణవైపు నడిపిస్తున్నారు. విద్యార్థులు స్వయంగా ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్, వాహనం రాగానే ఆటోమేటిక్‌గా ఓపెన్ అయ్యే చెక్‌పోస్టులాంటి ప్రయోగాలు చేస్తున్నారని, ల్యాబ్ రావడం తమ అదృష్టమని విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. చదువుకునేందుకు ఇబ్బందులు పడే తమకు అత్యాధునిక పరికరాలతో ప్రయోగశాలలను ఏర్పాటు చేసి మా ఆలోచనలకు ఆయువు పోసేందుకు ల్యాబ్‌ను తెచ్చిన ఆత్మకూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


ల్యాబ్‌లో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న హెచ్ఎం నాగరాజు


విద్యార్థులు ప్రయోగాత్మకంగా తయారు చేసిన ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్

# సమస్యల విన్నపాలతో ముగిసిన స్పందన

## 93 అర్జీలను స్వీకరించిన జాయింట్ కలెక్టర్ మౌర్య రెడ్డి

**దేవనకొండ మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రమైన దేవనకొండ యంపిడిఒ కార్యాలయం నందు జాయింట్ కలెక్టర్ మౌర్య రెడ్డి సమక్షంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం మండల ప్రజల సమస్యల విన్నపాలతో ముగిసింది.కొన్ని అనివార్య కారణాల కారణంగా స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడంతో జాయింట్ కలెక్టర్ మౌర్య రెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు, పత్తికొండ ఆర్డీఒ రామలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా అర్జీ దారులు వినతులతో వచ్చి వారి వారి సమస్యలపై విన్నవించుకున్నారు. ముఖ్యంగా పొలాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయని తెలుస్తోంది. దేవనకొండ యంపిటిసి సభ్యులు తపాలా విధ్యార్థులకు మండల కేంద్రంలో డియస్టీ హాస్టల్ భవణం మరియు మోడల్ స్కూల్, క్రీడా స్థలాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు.కుంకనూరు గ్రామానికి చెందిన హమాలీ యూనియన్ సభ్యులు దేవనకొండ టర్నింగ్ నందు రైతులకు సంబంధించి కూరగాయల మార్కెట్‌కు ప్రభుత్వ స్థలాన్నా కేటాయించాని అర్జీ ఇవ్వడం జరిగింది.లోక్ సత్తా నాయకులు రామదాస్ గౌడ్ మండలంలో భైరవానికుంట, బుర్రకుంట, బంటుపల్లి, బండపల్లి, చెల్లెలిచెలిమిల, బేతపల్లి, కె.వెంకటాపురం, పల్లెదొడ్డి గ్రామాలకు హంద్రీ నివా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించాని సిపిఎం నాయకులు వీరశేఖర్ విన్నవించారు. అలాగే వెనుకబడిన దేవనకొండ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం తక్షన చర్యలు చేపట్టాలని సిపిఐ మండల కార్యదర్శి నర్సారావ్ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్ నాయక్, యంపిడిఒ గౌరీదేవి, ఎఒ సురేష్ బాబు, పిఆర్ ఇన్చార్జి ఎఇ ఉదయ్, ఇఒపిఆర్డీ సూర్యనారాయణ, సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, యస్ఐ భూపాలుడు మరియు అన్ని శాఖల మండల అధికారులు హజరయ్యారు.



విన్నపాలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ మౌర్య రెడ్డి

# ప్రాధాన్యత భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

- పీఆర్ ఇఇ రాంమోహన్‌రెడ్డి
- జిల్లాలో రూ.17కోట్లతో ప్రాధాన్యత రహదారుల నిర్మాణం

**బండి ఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో వున్న ప్రాధాన్యత భవనాలను వేగంగా నిర్మించాలని పంచాయితిరాజ్ ఇఇ రాంమోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని లింగాపురం, నారాయణా పురం గ్రామాల మధ్యన నూతనంగా వేసిన బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఇఇ రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగతా ప్రాధాన్యత భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని వీటిలో 361 గ్రామ సచివాలయాలకు గాను 236 సచివాలయ నిర్మాణాలు పూర్తయ్యాయని అన్నారు. 29 సచివాలయ భవనాలను ఈనెల 5వతేది నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. 282 ఆర్‌బీకేలకు గాను 155 పూర్తయ్యాయని మరో 33 ఆర్‌బీకే భవనాలు ఈనెల 5వతేదికి పూర్తవుతాయని అన్నారు. అలాగే 168 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు గాను 72 పూర్తయ్యాయని మిగిలిన భవనాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత రహదారుల నిర్మాణం రూ.17 కోట్లతో చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఇందులో నంద్యాల-ఆత్మకూరు ప్రధాన రహదారి నుండి పరమటూరు మీదుగా పెసరవాయి వరకు, గాజులపల్లె నుండి బసాపురం వరకు, రేగడగూడూరు నుండి పెసరవాయి వరకు, వడ్లరామాపురం నుండి కొట్టాల చెరువు వరకు, ముష్టిపల్లె నుండి పెద్దానంతపురం వరకు ఐదు ప్రాధాన్యత రహదారుల నిర్మాణం కొరకు త్వరలోనే టెండర్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట డిల్లీ వెంకటరెడ్డి, ఏఇ వెంకటయ్య, కాంట్రాక్టర్ చక్రపాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రశాంత్, లింగాపురం గ్రామ నాయకుడు నరెడ్డుల సుబ్బారెడ్డిలు ఉన్నారు.



బీటీ పనులను పరిశీలిస్తున్న ఇఇ రాంమోహన్ రెడ్డి

# సేవామూర్తులకు అవార్డులో సత్కారం

**కర్నూలు ఎడ్యుకేషన్,మేజర్‌న్యూస్:** రెండు తెలుగు రాష్ట్రాల్లోని సేవామూర్తులకు అవార్డుతో సత్కరిస్తామని రాజ్‌కుమార్ స్వచ్ఛంద సంస్థఅధినేత బి.రత్నకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. ప్రతి రంగంలో నిత్యం అనేకమంది నిస్వార్థమైన సేవలు అందిస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి వారిని అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలామ్ 92వ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 20న ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలను 7569425354 నెంబరు సంప్రదించాలని ఆమె కోరారు.



బి.రత్నకుమారి

# స్పెషల్ క్యాంపెయిన్‌డే

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా ఈ నెల 4, 5వతేదీలోల జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్పెషల్ క్యాంపెయిన్‌డే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.సృజన శుక్రవారం తెలిపారు. సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌లో ముసాయిదా ఓటరు జాబితా-2024తో అందుబాటులో ఉంటారన్నారు. 01.01.2024తేదీ నాటికి 18సంవత్సరాలు నిండిన, నిండుతున్నట్లు అయితే కొత్త ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే పేరు మార్పు, చిరునామా మార్పు కోసం కూడా మీ సంబంధిత పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓకు అర్జీ ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని యువతీ, యువకులు, ఓటర్లు వినియోగించుకోవాలని కోరారు.

### కరువు భత్యం కింద విద్యార్థులకు

# ప్రత్యేక స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** కరువు మండలాలను ప్రకటించిందని, రాష్ట్రంలో అన్ని జిల్లాల కన్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యార్థులకు అన్నిరకాల ఫీజులను రద్దు చే సి, ప్రత్యేకమైన స్కాలర్‌షిప్ విడుదల చేయాలని టిఎన్ఎస్ఎఫ్ తాలుక అధ్యక్షుడు తలారి సిద్దప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలూరు నియోజకర్గం పశ్చిమ ప్రాంతంలో కరువుతో ప్రజలు, రైతులు, విద్యార్థులు స్కూలు, కాలేజీ ఫీజులు కాక పరీక్ష ఫీజులు కూడ కట్టించుకోనట్టువంటి తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో విద్యార్థులందరూ ఉన్నారన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యం కింద విద్యార్థులందరికి కూడ పద వ తరగతి నుంచి పీజీ చదివే విద్యార్థులకు కూడ ప్రత్యేకమైన స్కాలర్‌షిప్‌ను, అదే విధంగా స్కూలు ఫీజులు, తదితర ఫీజులను తక్షణమే రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల ఫీజుల రద్దు కొరకు భవిష్యత్తులో ఉధ్యమాలకు శ్రీకారం చుడతామన్నారు.



మాట్లాడుతున్న సిద్దప్ప

### రాయపాటి శ్రీనివాస్‌కు

# ఇంటర్నేషనల్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా గుర్తింపు



రాయపాటి శ్రీనివాస్

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంఘం అధ్యక్షుడు, అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సేవాసంస్థ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు మలేషియా దేశం నుంచి మలేషియన్ బోర్నియో అంబాసిడర్ అవార్డును అంతర్జాలం ద్వారా అందజేశారు. నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డు ఇచ్చినట్లు తెలిపారు. ఈ అవార్డు తమ సంస్థకు సమాజంకు మరింత బాధ్యతలు పెంచిందని రాయపాటి శ్రీనివాస్ తెలిపారు.

# తిక్కారెడ్డిని ముచ్చటగా మూడోసారి ఓడిస్తా

- నియోజకవర్గ ప్రజల నమ్మకమే నా ధైర్యం
- పార్టీ కార్యకర్తలే పార్టీకి మూలస్తంభం
- ప్రతి గ్రామంలో అభివృద్ధి చేపట్టాం
- అభివృద్ధి చేసిన పనులు బోర్డులపై వ్రాయిస్తాం
- ఎమ్మెల్యే

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డిని ముచ్చటగా మూడోసారి 2024 ఎన్నికల్లో ఓడిస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ సీఎం కావాలని ఎందుకు కావాలంటే అనే కార్యక్రమానికి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులే తనకు కొండంత ధైర్యమన్నారు. సీఎం జగన్ కులాలకు, మతాలకతీతంగా, రాజకీయ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో 2024 ఎన్నికల్లో వైసీపీ సింహంలా సింగిల్‌గానే పోటీ చేస్తుందన్నారు. ఈనెల 9వ తేదినుంచి గ్రామాల్లో చేసే అభివృద్ధిని బోర్డులపై చేసిన వాటిని వ్రాయిస్తామన్నారు. అలాగే గ్రామాల్లో ఇంటింటి ప్రచారం పార్టీ జెండాఎగురవేయడం మండల నాయకులు గ్రామాల్లో బస చేస్తారన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహాసారధులు, వలంటీర్లు గ్రామస్థాయిలో కష్టపడి పనిచేయాలని కోరారు. మన ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేల జీతం, సచివాలయ గృహాసారధులకు, కన్వీనర్లకు న్యాయం చేస్తామన్నారు. జగనన్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానన్నారు. జనసేన, టీడీపీ, కమ్యూనిస్టులు ఎంత మంది కలిసినా జగనన్నను ఓడించడం సాధ్యం కాదన్నారు. మా కుటుంబంలో జగన్మోహన్‌రెడ్డి ఎంతో నమ్మకం ఉంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా, ఒకరిని టీటీడీ పాలక సభ్యులుగా పదవులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ భీమ్‌రెడ్డి, ఇంచార్జీ విశ్వనాథ్‌రెడ్డి, కెడిసిసి కల్లుదేవకుంట చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, మాజీ చైర్మన్ వెంకటరెడ్డి, మంత్రాలయం సర్పంచు భీమయ్య, వైసీపీ నాయకులు లక్ష్మయ్య, రోగప్ప, మల్లికార్జున, జనార్థన్‌రెడ్డి, బొంబాయి శివ, రాఘవేంద్ర, రామాంజనేయులు, గోపి నాథ్, జక్కయ్య, ముక్కరన్న, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# స్పెషల్ క్యాంపులు

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు కోసం ఈ నెల 4, 5వతేదీల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర పాలక సంస్థ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శుక్రవారం తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాల్సిన వారు ఫోరం-6,7,8ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చాన్నరు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బూత్ ఆఫీసర్లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. అదే విధంగా ఏమైనా మార్పులు చేసుకోవాల్సిన ఓటర్లు కూడా ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# దోమల పట్ల జాగ్రత్తగా ఉండాలి

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** నగర ప్రజలు దోమల వ్యాప్తి పట్ల జాగ్రత్తగా ఉండాలని కర్నూలు నగర పాలక సంస్థ సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశులు అన్నారు. ఫ్రైడే డ్రై డేలో భాగంగా శుక్రవారం నగరంలోని పలు కాలనీల్లో నీటి నిల్వలను ఖాళీ చేయించడం, దోమల లార్వాలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పారిశుధ్య సిబ్బంది మందులు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

సూర్య



# ఎస్.ఆర్.బీ.సీ కెనాల్‌పై అధికారుల పర్యవేక్షణ కరువు

**– కార్యాలయాలకే పరిమితమైన సిబ్బంది**



**కెనాల్‌కు నీరు వెళ్లకుండా ముళ్లపొదలతో మూసుకుపోయిన దృశ్యం**

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె మండలంలో ఎస్.ఆర్.బి.సీ కెనాల్ ద్వార ఎంతో మంది రైతులు తమ పంటలను పండించుకుంటు న్నారు. అయితే వర్షాభావ పరిస్థితుల వలన ఈసారి కెనాల్‌కు నీరు సరిగా రాకపోవడంతో చాలీచాలని నీటితో రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. అయితే ఎస్.ఆర్.బి.సీ అధికారుల పర్యవేణ మాత్రం ఏ మాత్రము కనిపించడం లేదు. బనగానపల్లె సమీపంలోనే ఎస్.ఆర్.బి.సీ 9బ్లాంక్ పంట కాల్వలో పూర్తిగా ముళ్లకంపలతో నిండిపోయి నీరు ప్రవహించకుండా మోరీలలో అడ్డుగా నిలవడంతో కాల్వలు తెగిపోతాయేమోనన్న పరిస్థితి ఏర్పాటైంది. బ్లాకులను పరిశీలించాల్సిన అధికారులు లష్కర్‌లు ఎక్కడున్నారో కూడా కనిపించడం లేదు. దీనితో రైతులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అంతేకాక 9బ్లాక్ పూర్తిగా శిధిలావస్థకు చేరినా అధికారులు ఏరోజు వచ్చి చూచిన పాపాన పోలేదు. ఇది ఇలాగే కొనసాగితే పంట కాల్వలు ఎక్కడికక్కడ తెగిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విడతల వారిగా నీటిని ఎస్.ఆర్.బి.సీ కెనాల్‌కు అందివ్వడం జరుగుతుంది. అయితే కెనాల్ పరిస్థితి ఇలా ఉండటంతో చివరి ఆయకట్టుకు నీరు ఎప్పటికి చేరుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పాటైంది. ఇప్పటికైనా ఎస్.ఆర్.బి.సీ అధికారులు నిద్రమత్తును వీడి కెనాల్‌పై పర్యవేక్షణ పెంచి ఎక్కడికక్కడే మరమ్మత్తులను చేసి రైతులకు సహకరించాలని బనగానపల్లె రైతులు కోరుతున్నారు.

# అభ్యసన సామర్థ్యాల పరీక్షల పరిశీలన



**అభ్యసన సామర్థ్యాలపై నిర్వహించిన పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** అన్ని పాఠశాలల్లో 3వ తరగతి, 6వ తరగతి, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాల పై సర్వే కొరకు నిర్వహించిన పరీక్షలను జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆకస్మికంగా పరిశీలించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని కెఎన్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 3,6,9 తరగతులను నుంచి తరగతుల వారీగా ఎంపిక చేసిన 30మంది విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలను తనిఖీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కెఎన్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన పరీక్షను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 1116 పాఠశాలల్లో 28938 మంది విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొన్నారు. అలాగే 2232మంది ఉపాధ్యాయులు 1116మంది ప్రధానోపాధ్యాయులకు సర్వే నిర్వహించారు. ఈసర్వే ద్వారా పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తారని డీఈఓ సుధాకర్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్వశిక్ష అభియాన్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# స్పందనకు అధికారుల స్పందన కరవు

**మిద్దూరు, మేజర్‌న్యూస్ :** పదుల సార్లు స్పందనలో ఫిర్యాదులు ఇచ్చినా అధికారులు స్పందించకుండా లోకాయుక్త, లోక్ అదాలత్ కోర్టుల ఉత్వర్వులను ఉల్లంఘించి ఆత్మకూరు ఆర్డీఓ దాసు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని ఫారెస్టు అధికారులకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. వివరా ల్లోకి వెళ్లితే మిద్దూరు గ్రామంలో ఎస్సీ వర్గీనికి చెందిన బన్నూరు రవణమ్మ సుంకేసుల గ్రామంలోని ప్రభుత్వ భూమిని 2013 నుంచి సాగు చేస్తున్నారు. మండల సర్వేయర్ ద్వారా బన్నూరు రవణమ్మ సాగు చేస్తున్నట్లు ఆధారాలను చూపగా లోక్ అదాలత్, లోకాయుక్త కోర్టుల్లో 3182022లో నమోదు కావడం తో విచారణ జరిపిన అనంతరం ఆ భూమిని రవణమ్మ సాగు చేసుకునేలా అధికారులకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. అయితే ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఆ భూమిని కొందరు వైసీపీ నాయకులకు అప్పజెప్పాలని ఆర్డీఓ దాసు చూశారు. అయితే ఈ విషయంపై నంద్యాల జిల్లా కలెక్టర్, లోకాయుక్త, లోక్ అదాలత్ కోర్టుల్లో ఫిర్యాదు చేయడంతో ఆ భూమిని ఎస్సీలకు చెందకుండా ఫారెస్టు అధికారులకు ఆ భూమిని అప్పజెప్తున్నారు. సమస్య పరిష్కారం కోసం కలక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో పదుల సంఖ్యలో అర్జీలు ఇచ్చినా స్పందించడం లేదని బాధితుల పట్ల అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో పాటు కణికరం చూపడం లేదంటూ మిద్దూరు తహశీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి వాడాల ప్రభాకర్, జిల్లా సీనియర్ నాయకులు ప్రేమ్‌రాజు, వాడాల శ్రీను, నాగరాజులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనాఅధికారులు స్పందించి న్యాయబద్ధంగా విచారణ జరిపి బాధితురాలుకు డి పట్టా మంజూరు చేసి భూమిపై హక్కు పత్రాలు ఇవ్వాలని ఎమ్మార్పీ ఎస్, మహాజన సోషలిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ, సతీష్, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




**నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు**

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో పతకాలు సాధించాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** ఈ నెల 4 వతేదీనుంచి 6వతేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో జరుగనున్న రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ అండర్–17 బాల,బాలకల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఎస్జీఎఫ్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియంలో జరిగిన జట్టు వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. క్రీడా స్ఫూర్తితో పూర్తి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జట్టు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని క్రీడాకారులకు సూచించారు. జట్టు కోచ్ మేనేజర్లుగా గిడ్డయ్య, దాదాపీర్, వెంకటేశ్వర్లు, ఈరన్న వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్జీఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీలు శేఖర్, బాష, వ్యాయామ ఉపాధ్యాయులు క్రిష్ణ, కిషోర్, శేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.




# ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ సరఫరా

**– ఎంఎల్ఎస్ పాయింట్‌లో కాట వేయకుండా సరఫరా**

**– రేషన్ లారీ టూ లారీ ట్రాన్స్‌ఫర్**

**పత్తికొండ టౌన్, మేజర్‌న్యూస్ :** స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్, ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్ నుండి రేషన్ దుకాణాలకు రేషన్ సరఫరా చేస్తున్నారు. ఈ రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని పలు ఆరోపణలు ఉన్నాయి. పత్తికొండ డివిజన్ కేంద్రమైన పత్తికొండ, తుగ్గలి, ఆస్పరి, దేవనకొండ, మద్దికెర, తదితర మండలాలకు సంబంధించిన గ్రామాలకు ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్ నుండి డీలర్‌కు, రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం, కందిపప్పు, చక్కెర, రాగులు పంపిణీ చేస్తున్నారు. ఈ స్టాకు పాయింట్‌లో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు డీలర్లు,ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం స్టాకును పంపించిన అనంతరం ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్లో నిల్వ ఉంచుకొని తూకాలు వేసి ఆయా మండలాలకేంద్రంలో ఉన్న డీలర్లకు తూకాలు వేసి రేషన్ సరఫరా చేయాలి, ఇవేమి పట్టించుకోకుండా గోడౌన్ ఇంచార్జీ ఇష్టారాజ్యంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ సరఫరా చేస్తున్నారు. వచ్చిన రేషన్‌ను లారీటూ లారీ ట్రాన్స్‌ఫర్ చేసి అక్కడికక్కడే డీలర్లకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు రేషన్ సరఫరా అందేలా చూడాలని, ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్లో కాటా వేసి రేషన్ సరఫరా చేయాలని కోరారు. ఈ విషయంపై గోడౌన్ ఇంచార్జీ అడుగగా, డీలర్లు ఇష్ట ప్రకారమే లారీ టూ ట్రాన్స్‌ఫర్ చేసి పంపిణీ చేస్తున్నామని డీలర్లకు టేరు వైట్ ఇస్తున్నామన్నారు. తూకాలు ఏం తక్కువ రావన్నారు.



**లారీ టూ ట్రాన్స్‌ఫర్ చేస్తున్న హమాలీలు**

# ఎండిన రైతన్నల ఆశలు



**– రబీ సాగుపై ఆశలు వదులుకున్న రైతులు**

**– ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు అరకొరనే**

**– తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న వైనం**

**– అప్పులను మూటగట్టుకొని కుంగిపోతున్న రైతన్నలు**

**కౌతాళం, మేజర్‌న్యూస్ :** ఈ యేడాది వరుణుడు ముఖం చాటేయడంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వాన జాడ కానరాకపోవడంతో సాగు అయిన అరకొర పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ఇంతటి కరవు పరిస్థితులను తామెన్నడూ చూడలేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు పూర్తిగా కనుమరుగవడంతో బోరుబావుల్లో కూడా నీటి జల తగ్గిపోతుంది. దీంతో బోరుబావుల రైతులు కూడా గగ్గోలు పెడుతున్నారు. కరువు పరిస్థితుల కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు వలసబాట పడుతున్నారు. తమను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలకేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని హాల్వి, చూడి, ఉరుకుంద, బుడుములదొడ్డి, ఎరిగేరి తదితర గ్రామాల్లో ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతుల పంటలు వర్షాలు లేకపోవడంతో తుడుచుకుపెట్టుకుని పోయాయి. ఖరీఫ్‌లో అరకొరగా పంటలు సాగవ్వగా వర్షాలు రాకపోవడంతో మొలకదశలోనే పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులు అప్పులపాలయ్యారు. రబీ సీజన్‌లోనైనా పంటలను సాగు చేసుకుందామని నెల రోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు చివరికి నిరాశే ఎదురయ్యింది. ఇప్పటికే ముందస్తుగా విత్తనం వేసుకున్న రైతులకు వర్షాలు పడితే పంటలు పండుతాయని నిత్యం మేఘం వైపు చూస్తూ వరుణుడి కరుణకోసం ఎదురు చూస్తున్నారు. ఇక పంటలను సాగుచేసుకునేందుకు సమయం లేదని మరికొంతమంది రైతులు రబీ సీజన్‌పై పూర్తిస్థాయిలో ఆశలు వదులుకున్నారు. ఇంతటి కరువు పరిస్థితులను తామెన్నడూ చూడలని వాపోతున్నారు. పంటల సాగుకు, విత్తనాలకు రైతులు లక్షలాది రూపాయలను అప్పులను చేసుకుని అప్పుల పాలయ్యారు. చేసిన అప్పులను తీర్చేందుకు రైతులు, వ్యవసాయ కూలీలు వలసబాట పడుతున్నారు.

**అడుగంటిపోతున్న భూగర్భ జలాలు**

**– బెంబేలెత్తిపోతున్న బోరుబావుల రైతులు :**

వర్షాభావ లోటుతో జిల్లాలో భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు పేర్కొంటున్నారు. మెట్ట ప్రాంతంలో రబీలో పెద్ద ఎత్తున రైతులు వివిధ రకాల పంటలను సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు తగ్గిపోవడంతో వయవసాయ బోర్ల నుంచి నీరు సరిగా రావడంలేదని గగ్గోలు పెడుతున్నారు. రబీ సాగుపై మరింత ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వచ్చే నెల నుంచి మొక్కజొన్న, పొగాకు వంటి పంటలను రైతులు మెట్ట ప్రాంతంలో పెద్ద ఎత్తున సాగు చేయనున్నారు. సాగునీరు అవసరం పడుతోంది. బోర్ల నుంచి నీరు సరిగా రాకపోతే పంటలు దెబ్బతింటాయని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఎక్కడిక్కడే చెరువులు అడుగంటడంతో ప్రత్యామ్నాయ పరిస్థితులు కూడా కనిపించడం లేదు. ప్రభుత్వం అందుకు తగిన విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందించి రైతులకు సూచనలు చేస్తుందో లేదో చూడాల్సి ఉంది.